ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



## (సఖినేటిపల్లిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 14-2-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

మనం పూజచేసిన జపం చేసిన, ధ్యానం చేసినా జడబుద్ధిని వదిలించుకోవాలి. బుద్ధిలో ఉన్న దోషాలు, మొద్దుతనం తగ్గకపోతే ఎన్ని శాస్త్రములు చదివినా భగవంతుడు అంటే ఏమిటి, ఆయన శక్తి ఏమిటి అని భగవంతుడి గురించి ఒక సమగ్రమైన ఆలోచన మనకి కలుగదు. భగవంతుడి గురించి మనం ఊహించుకోవటం కంటే భగవదనుభవం పొందాలి. జడబుద్ధి మనకు భగవదనుభవం కలుగనివ్వదు. జడ బుద్ధిని, స్థూల బుద్ధిని తగ్గించుకొని సూక్ష్మ బుద్ధిని సాధించటానికి ప్రయత్నం చేయాలి. మన సాధనల యొక్క ప్రయోజనం కూడా ఇదే. మన చదువు ఒక్క పొట్టకోసమే కాకుండా, మనోనిగ్రహం కలగటానికి మనం చదివిన చదువు సహకరించాలి. నీవు చదివిన చదువు వలన మనస్సుకు ఏకాగ్రత రాకపోతే ఆ చదువువలన ప్రయోజనం లేదు. పూజ చేసినపుడు, ధ్యానం చేసినపుడు మనస్సు కొద్దిసేపు అణిగి ఉంటుంది, మరల విజృంభిస్తుంది అందువలన మనస్సును జాగ్రత్తగా చూసుకోవాలి. దాని చేష్టలను గమనిస్తూ ఉండాలి. రజోగుణం రాకుండా చూసుకోవాలి రజోగుణం మనోమాలిన్యమును పెంచుతుంది. మన మాటలో, చూపులో, చేతలో, తలంపులో సాత్వికంగా ఉండాలి. సాత్విక బుద్ధిని అలవర్చుకోవాలి. నిగ్రహింపబడిని మనస్సుకు మాత్రమే అంతర్దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి కలిగిన మనస్సు తన మూలంలోనికి ప్రయాణం చేస్తుంది.

ఇక్కడ పుణ్యం చేస్తే మరణించిన తరువాత స్వర్గంలో భోగాలు అనుభవించవచ్చును అని మనం అనుకొంటున్నాము. స్వర్గంలో ఏ సుఖాలు, భోగాలు ఉన్నాయని మీరు అనుకొంటున్నారో జీవన్ముక్తుడితో నీకు సహవాసం దొరికితే అంతకంటే ఎక్కువ సుఖాలు, ఎక్కువ భోగాలు ఈ భూమి మీద ఇప్పడే నీవు అనుభవించవచ్చును అంటున్నారు ఆచార్యులవారు. పూర్వజన్మలో మనం చేసిన పాపాలు ఈ జన్మలో రోగాలుగా వస్తున్నాయి అందువలన నిషిద్ధకర్మలు చేయకూడదు అంటే భగవంతుడు ఏపని అయితే చేయవద్దు అని చెప్పాడో ఆపని మనం చేయకూడదు. భగవంతుడు వద్దని చెప్పిన పనిని చేస్తే మనకు దుఃఖం, అశాంతి వస్తాయి, భగవంతుడిని తెలుసుకొనే మార్గం తప్పిపోతాము.

హృదయంలో ఉన్న సత్యవస్తువుకు సంబంధించిన అనుభవం ఒకోసారి కలుగుతూ ఉంటుంది. కాని అది సహజం అవ్వదు. ఆ అనుభవం సహజం అవ్వకుండా మీ వాసనలు అడ్డుకుంటాయి ఏ వాసనలు అయితే నిన్ను దేహానికి, లోకానికి బంధిస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికి నిరంతరము ప్రయత్నం చేయాలి. వాసనలు ఉన్నంత వరకు ప్రయత్నం చేయటం ఆపకూడదు. వాసనలు

పూర్తిగా నశిస్తేగాని ఆత్మానుభవం శాశ్వతం అవ్వదు. జీవుడికి హృదయంలో పడిపోవాలని ఉంది. కాని జీవుడు హృదయంలో పడిపోకుండా వాసనలుపట్టుకొని ఉన్నాయి. జీవుడు తన మూలంలో పడిపోకుండా ఏ అలవాట్లు, వాసనలు పట్టుకొని ఉన్నాయో వాటిని తొలగించుకోవటానికే సాధన. వాసన వేరుతో సహా నశించిన తరువాత నీకు ఆత్మానుభవం స్థిరమవుతుంది. ఏయోగం ద్వారా ప్రయాణంచేసినా జీవుడు తన మూలంలోనికి వెళ్ళాలి. కర్మచెయ్యి, తెలుసుకొనిచెయ్యి, ఏ విధంగా పనిచేస్తే మోక్షం పొందటానికి సహకరిస్తుందో ఆ విధంగా పనిచెయ్యి, మనం ఎంత సేపు చర్మ దృష్టితో చేస్తాము. అలా కాకుండా ఈశ్వరార్పణ బుద్ధితో చెయ్యి. వాసన పోగొట్టుకోవటం అంత తేలికకాదు. గురువు అనుగ్రహం లేకుండా ఒక చిన్న వాసన నుండి కూడా బయట పడలేము. దిగితే లోతు తెలుస్తుందిగాని దిగకపోతే లోతు ఎలా తెలుస్తుంది. మీకు ఏ వాసన అయితే ఉందో దానిని తొలగించుకోవటానికి ఎప్పుడైనా ప్రయత్నంచేస్తే దానికి ఎంత బలం ఉందో మీకు తెలుస్తుందిగాని లేకపోతే మీ వాసనకు ఎంత బలం ఉందో మీకు తెలియదు. వాసన యొక్క వయస్సు ఎక్కువ, మీ సాధన యొక్క వయస్సు తక్కువ అందువలన అనుకొన్నంత తొందరగా వాసన నశించదు. పూర్వజన్మలో సాధన చేసి ఉంటే ఇప్పుడు అవి తొందరగా పోతాయి.

మన హృదయంలో ఉన్న సత్యవస్తువు ఒకటిగా ఉంది, అది ఏకరసం, అది శాంతి స్వరూపం, జ్ఞానస్వరూపం. అది తెలియబడిన వెంటనే అందులో ఉన్న ఆనందం, శాంతి, జ్ఞానం నీకు వ్యక్తమవుతుంది, లోపల ఉన్న వస్తువు దొరికే వరకూ ఆనందమును, శాంతిని బయట ఉత్పత్తి చేసుకోవటం తప్పదు. లోపల ఉన్న ఆనందం అనుభవంలోనికి వచ్చే వరకూ ఏదో ఒక రకమైన ఆనందం కోసం బజారులోని విషయాలలో తిరుగుతాము. ఇలా చనిపోతూ, పుడుతూ ఉంటాము. మా ఇంటిలో గొడవగా ఉంది, నాకు కుదురుగా లేదు సినిమాకి పోతాను అంటాము. అంటే సినిమాచూసి శాంతిని పొందుదాము అనుకొంటాము. నీహృదయంలో ఉన్న ఏకరసం నీకు అనుభవంలోనికి వచ్చేవరకూ బాహ్యంగా ఏదో ఆనందమును ఉత్పత్తి చేసుకోవటం తప్పదు. సహజమైన ఆనందము దొరకనపుడు ఉత్పత్తి అయ్యే ఆనందంకోసం ఏడుస్తాము. ఉత్పత్తి అయ్యే ఆనందం కోసం చూడకుండా సహజమైన ఆనందము కోసమే ఎదురుచూసే వాడిని ధీరుడు అంటారు. స్వరూపఆనందం కోసమే ప్రయత్నించు. బాహ్యంగా ఉత్పత్తి అయ్యే ఆనందాల వైపుకు నీ మనస్సును మళ్ళించవద్దు. స్వరూపఆనందం మీదనే నీ దృష్టిని పెట్టు, దానిని పొందటానికే ప్రయత్నించు.

దేహం ఉంటే లోకం, దేహం లేకపోతే లోకం లేదు. దేహం ఉంటే భోగాలు అనుభవించవచ్చును, దేహంపోతే భోగాలు అనుభవించటం కుదరదు అందువలన మరణం అంటే భయం కలుగుతోంది నీకు భోగ దృష్టి లేకపోతే దేహం ఉన్నా, లేకపోయినా ఒక్కటే. జ్ఞానికి మరణం అంటే భయం కలుగదు ఎందుచేతనంటే దేహం మరణించిన తరువాత కూడా తాను ఉంటాను అన్న సంగతి వాడికి తెలుస్తూ ఉంటుంది. విషయచింతన వలన దుఃఖం కలుగుతుంది, ఆత్మచింతన వలన సుఖం కలుగుతుంది, నీకు దుఃఖం అంటే ఇష్టం ఉండదు. సుఖం అంటే ఇష్ట పడతావు సుఖాన్ని కోరుకొంటావు నీ

స్వరూపంలో ఉన్నది సుఖమే. నీ స్వరూపంలో ఏదైతే ఉందో అది కావాలి అని కోరుకుంటున్నావు. అంటే నీకు తెలిసినా తెలియకపోయినా నీవు ఎవరో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నావు. విగ్రహాలు చుట్టూ తిరిగిన, నదులలో స్నానాలు చేసినా మహాత్ములను దర్శించినా నీవు ఎవడో నీవు తెలుసుకోవటానికే ఈ ప్రయత్నాలు అన్నీ చేస్తున్నావు. నీవు ఎవడో నీకు తెలియకపోతే నీకు ఆనందం లేదు, శాంతిలేదు, జ్ఞానం లేదు. సూర్యుడు ఉదయించిన వెంటనే చీకటి ఒక్కటే నశించదు, చీకటిలో జరిగే పనులు అన్నీ ఆగిపోతాయి. అలాగే నీకు జ్ఞానం వచ్చిన వెంటనే అజ్ఞానం ఒక్కటే నశించదు, అజ్ఞానంతో నీవు చేసే పనులు అన్నీకూడా నశిస్తాయి అన్నారు ఆచార్యులవారు. పరిస్థితులు అనుకూలంగాఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఉద్రేకం రాకుండా చూసుకొంటే, నీవు సమానంగా ఉండగలిగితే మనస్సు తన మూలంలోనికి ఉపసంహరింపబడుతుంది. కుండలను చూడకు ఆధారంగా ఉన్న మట్టిని చూడు. కుండలు ఎన్ని రకాలుగా ఉన్నా మట్టి ఒక్కటే. ఈ ఫ్యాన్సీ గొడవలు వద్దు. ఈ రూపాలు చూడవద్దు. అన్ని రూపాలలో, నామాలలో ఉన్నది చైతన్యమే, దానిని చూడు నీకు వికారము కలుగదు.

నీకు వచ్చే తలంపులను జాగ్రత్తగా పరిశీలన చేస్తే వాటికి దేహమే కేంద్రంగా ఉంటుంది. నీకు దేహబుద్ధి ఉన్నంత కాలము ఇతర తలంపులు వస్తూనే ఉంటాయి, వాటికి దేహమే కేంద్రం అవుతుంది. ఇలా తలంపులు ఎక్కువగా వచ్చే కొలది నీ స్వరూపానికి దూరమవుతావు. భగవంతుడు మీకు ఇచ్చిన సదుపాయములు చూసుకొని గర్వం తెచ్చుకోవద్దు అవినయం తెచ్చుకోవద్దు. వాటిని ఉపయోగించుకొని మనస్సు అణిగే పద్ధతి చూసుకోండి ఆత్మవిచారణ అంటే మంత్రాలను జపించటం కాదు, నేను ఎవడను అని ప్రశ్నించుకోవటంకాదు, నిరంతరము ఆత్మయొక్క ఎరుక కలిగి ఉండటమే ఆత్మ విచారణ, ఇప్పుడు మన వ్యవహారములు అన్ని దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని ఉంటాయి. మీకు ఆత్మానుభవంకలగాలంటే ఆత్మను కేంద్రంగా పెట్టుకొని పనిచేయాలి. మనం చేసే పనులకు భగవంతుడే కేంద్రంగా ఉండాలి. భగవంతుడు సంతోషించే పనులు చేస్తే ఆయన అనుగ్రహానికి పాత్రులవుతాము. భగవంతుని అనుగ్రహానికి పాత్రులమయినపుడు ఆయన అంతటి వాడిగా చేస్తాడు. బాధలు అన్నీ అహంభావనకే. ఆత్మలో స్థిరత్వం సంపాదించు. నీకు ఉన్న బాధలు అన్నీ అణిగిపోతాయి. అప్పుడు మనస్సు పొంగిపోవటం, కృంగిపోవటం ఉండదు. మనస్సు ఉన్నప్పటికి కాలిన తాడులా ఉంటుంది. ఈ లోకం అంతా దుఃఖమయం అని నీవు అనుకోవచ్చు. ఈలోకాన్ని లోకంగా చూడకు. లోకాన్ని బ్రహ్మంగా చూడు అప్పుడు నీ దుఃఖం అంతాపత్తా లేకుండా పోతుంది. అంతా బ్రహ్మమే. ఇది అంతా బ్రహ్మములోనే వ్యక్తమవుతోంది, బ్రహ్మములోనే ఐక్యమవుతుంది, లోకాన్ని చూద్దువుగాని తొందరపడకు నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూస్తే లోకం దుఃఖమయంగా కనబడదు, బ్రహ్మంగానే కనబడుతుంది. ఎవడికైతే లోకం బ్రహ్మంగా కనిపిస్తోందో వాడికి దుఃఖం లేదు. నీవు బ్రహ్మంలో నిలకడగా ఉండు. నేను అది సాధించాను, నేను ఇది ఉద్ధరించాను అంటున్నావు ఆ నేను ఎవడో విచారణచెయ్యి నీకు జ్ఞానం కలుగుతుంది. ఆ నేనును విచారణ చేయకపోతే కోటి జన్మలు ఎత్తినా నీకు జ్ఞానం రాదు.

భగవాన్ ఉపదేశసారంలో ఏదైతే మనగతి అని చెప్పారో అదే నిజమైనగతి ఆగతిని పట్టుకోవటానికి అనుగుణంగా మన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి, దైనందిన జీవితంలో మన ప్రవర్తన దానికి అనుగుణంగా ఉండాలి. కాని మనం అదే నిజమైన గతి అనుకోవటం లేదు. ఆగతిని నిరోధించే పనులు చేస్తున్నాము మనమాట, మన తలంపు మన గతిని నిరోధిస్తున్నాయి. కొంతమంది ఏమనుకొంటున్నారు అంటే ఈ దేహం చనిపోయిన తరువాత స్మశానంలో దీనిని కాల్చివేస్తారు అంతటితో ఈ జీవితం ముగుస్తుంది అనుకొంటున్నారు. అలా ముగిస్తే సాధన అక్కరలేదు. అప్పుడు దేహానికి సంబంధించిన చరిత్ర ముగుస్తుందిగాని జీవుడికి సంబంధించిన చరిత్ర ఆగదు. జీవ లక్షణాలు ఉన్నంత వరకూ దేహం తరువాత దేహం వస్తూనే ఉంటుంది. నీవు గతిని పొందే వరకూ ఈ శవాలను మోయవలసిందే. అందువలన ఆగతిని పొందటానికి అనుగుణంగా మన ప్రవర్తనను తీర్చిదిద్దుకోవాలి పాయసం త్రాగేటప్పుడు మనకు ఎలా ఉంటుందో భగవంతుని కళ్యాణగుణాలు విన్నప్పుడు మనకు అలా ఉండాలి. దేవుడు ఎక్కడో ఉన్నాడు అనుకొంటున్నాము. భక్తివలన, శ్రద్ధ వలన, ప్రేమ వలన, అప్యాయత వలన ఎక్కడో ఉన్నాడు అనుకొనే దేవుడిని దింపుకోవాలి. నిన్ను పని చేయవద్దు అని చెప్పటం లేదు. అహంకారమును సంతృప్తిపరచే పనులు చేయవద్దు. ఈశ్వరుడు సంతోషించే పనులుచెయ్యి. ఈశ్వరుడు సంతృప్తి పడే పనులు చేస్తే ఈశ్వరుడుని పొందుతాము. మంత్రాన్ని జపించటం వలన రెండు లాభములు మీకు కాలక్షేపం అవుతుంది, భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతారు. దేవుడు తనకంటే భిన్నంగా లేడు అని తెలిసికూడా జ్ఞాని భగవంతుడిని గౌరవిస్తున్నాడు. అది జ్ఞాని యొక్క వైభవం కాని మనం అలాగ ఉండటం లేదు.

## (సఖినేటిపల్లిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 15-2-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

అహంకారముతో మనకు ఉన్న సంబంధమును తొలగించుకోవటానికి చేసే ప్రయత్నమే సాధన. అహంకారముతో మనకు ఉన్న సంబంధము నశిస్తే హృదయంలో ఉన్న శాంతి మనకు దొరుకుతుంది. దైనందిన జీవితంలో మనం కుటుంబంలో ప్రవర్తించే తీరు, సమాజంలో ప్రవర్తించే తీరు ఎలా ఉందో చూసుకోవాలి. ఇతరులపట్ల మనకు ఉన్న అనుబంధములో అహంకారం లేకుండా చూసుకోవాలి. అహంకార రహితముగా మానవుడి ప్రవర్తన ఉంటే వాడికి తెలియకుండానే వాడి మనస్సు హృదయగృహలో రాలిపోతుంది. దైనందినజీవితంలో కొన్ని గంటలు పూజ, జపం, ధ్యానం చేసుకోవటం మంచిదే, మిగిలిన టైములో అహంకారముతో జీవిస్తే గజస్నానంలా ఉంటుంది. అంటే స్నానం చేసి మరలా బాడి చేసుకొన్నట్లు అవుతుంది. అహంభావన లేని జీవితం జీవించాలి. మన ప్రవర్తన అహంకార రహితముగా ఉంటే అహంకారరహిత జీవితం వస్తుంది. అహంభావన లేకుండా మానవుడి ప్రవర్తన ఉంటే ఆత్మ సాక్షాత్కారముదాని అంతట అదే కలుగుతుంది.

ఇప్పుడు మనకు దేహమునందు నేను అనే బుద్ధి ఉంది. అలాగ చైతన్యమునందు, హృదయంలో ఉన్న ఏకరసం నందు నేను అనే బుద్ది కలిగితే మరల శరీరం అనే గుహలోనికి రానక్కరలేదు.

హృదయగుహలో ఉండి పోవచ్చును. హృదయగుహలోనికి ఎంతకాలం అయితే చేరుకోలేవో అంత కాలం శరీరం అనే గుహలోనికి రావలసిందే అంటే పునర్జన్మ తప్పదు. హృదయగుహలో స్థిరపడినవాడికి శరీరం అనే గుహలోనికి రానక్కరలేదు. నేను ముసలివాడిని అయిపోయాను అంటారు నేను ముసలిది అవ్వదు.దేహం ముసలిది అవుతుంది. దేహమేతాను అని భావించటం వలన నేను ముసలి వాడిని అయ్యాను అంటోంది. ఈ నేను నుండి విడుదల పొందటమే మోక్షం. ఈ దేహగతమైన నేను నుండి విడుదల పొందటానికే పూజ, జపం, ధ్యానం, సత్పురుషుల సహవాసం. ఉపనిషత్ వాక్యాలను, భగవంతుని మాటలను విశ్లేషణ చేసేటప్పుడు ఆ చెప్పే వ్యక్తికి చదువుతో పాటు తపస్సు ఉంటే ఆ మాటలు మీ అహంకారము యొక్క పొరలను చీల్చుకొని వస్తువు ఎక్కడ ఉందో అక్కడకు తీసుకొనిపోతాయి. అందువలన విద్య ఒక్కటే సరిపోదు, తపస్సు అవసరము. తపస్సు చేయటానికి దేహము యొక్క సహకారము, మనస్సుయొక్క సహకారము అవసరము, దేహము యొక్క సహకారము కావాలంటే దేహఆరోగ్యము సరిగా చూసుకోవాలి. అతిగా తినకూడదు, అతిగా మాట్లాడకూడదు, స్నేహాలు తగుమాత్రంగా ఉండాలి, అతి ఉండకూడదు. స్నేహాలు అతిగా ఉంటే రాగం ఏర్పడుతుంది. రాగం ఉన్నవాడు పాపం చేయకుండా ఉండలేడు. ఇప్పుడు అజ్ఞానం మనకు తియ్యగా ఉంది. తియ్యగా ఉన్న వస్తువును ఎలా విడిచిపెడతాము. మహాత్ముల దర్శనం వలన అజ్ఞానం మీద చేదు కలుగుతుంది. పొందవలసిన వస్తువు మీద తియ్యదనం కలుగుతుంది, కొంత మందికి జీవితం మీద ఏవగింపు ఉంటుంది. వారిని చూసి వారే అసహ్యించుకొంటారు. అది మంచిదికాదు. మనం పోజిటివ్‌గా జీవించాలి. నీవు పొందవలసినది ఏది, విడిచిపెట్టవలసినది ఏది అనే విచక్షణ మహాత్ముల దర్శనం వలన, కలుగుతుంది. నీవు ఒక మాట మాట్లాడితే, ఒక పనిచేస్తే అది నీకు జ్ఞానం సంపాదించుకోవటానికి సహకరించాలి, ఇతరులకు జ్ఞానం సంపాదించుకోవటానికి సహకరించాలి. అలా మన దైనందిన జీవితం ఉండాలి.

శరీరానికి అవసరాలు ఎలా ఉన్నాయో మనస్సుకు కూడా అవసరాలు ఉంటాయి. ఈ ఆధ్యాత్మిక ప్రవచనములు మనస్సుకు ఉన్న అవసరములను తీరుస్తాయి. అది గుర్తించే శక్తి లేక కొంతమంది లౌకికులు ఈ ప్రవచనముల వలన ప్రయోజనము ఏముంది అంటారు. సూక్ష్మంగా ఉండే ప్రయోజనంవారు గ్రహించలేరు. గ్రహించే శక్తిలేక వారు అలా మాట్లాడతారు. ఆ మాటలకు కంగారు పడవద్దు. ఒక మాట చెపుతున్నాను అనుకోండి. దాని యొక్క అర్థం నాకు తెలియనపుడు నేను దానిని ఆస్వాదించలేను. చెప్పేవాడికి రస హృదయం లేనప్పుడు వినేవాడికి రస హృదయం ఎలా కలుగుతుంది. మీకు ఎంత డబ్బు ఉన్నా విషయాలను చింతిస్తూఉంటే మీకు అశాంతి వస్తుంది. విషయాలలో అశాంతి ఉంది కాబట్టి విషయాలను చింతిస్తే అశాంతే వస్తుంది. దరిద్రుడు అయినా ఆత్మనుచింతిస్తే వాడికి శాంతి వస్తుంది. ఆత్మలో శాంతి ఉంది కాబట్టి ఆత్మనుచింతిస్తే శాంతి వస్తుంది. నాలుగు గంటలు ఉపన్యాసం చెప్పి మీ మనస్సును శరీరం చుట్టూ త్రిప్పుతున్నాము అనుకోండి ఇంక అది లోపలకు ఏమి వెలుతుంది. ఎక్కడయితే ఈశ్వరుడు ఉన్నాడో అక్కడకు మీ మనస్సును తీసుకొని వెళ్లేదే బోధ లేకపోతే అది బాధ.

భగవంతుని అనుగ్రహం లేకుండా నీవు ఎన్ని తంటాలుపడినా మనస్సు అంతర్ముఖం అవ్వదు. మనస్సుకు అంతర్ దృష్టి లేకపోతే అది హృదయగుహలోనికి వెళ్లదు. ఈ ప్రవచనములు విన్నంతసేపు అహంభావన తొలిగించుకోవాలి, అనుకొంటాము. ఇక్కడ నుండి బయటకు వెళ్లిన తరువాత దేనినైతే తొలగించుకోవాలి. అనుకొంటున్నామో దానికి నీరు పోసి పెంచుతాము. అహంభావనకు నీరుపోస్తాము అది ఎలా పోతుంది. అహంభావన లేకుండా ఎలా జీవించాలి అనే వివేకము ఈశ్వరానుగ్రహం లేకుండా కలుగదు. మనం లోపలకు ప్రయాణం చేయాలంటే ఎంతో పూర్వ పుణ్యం ఉండాలి. 24 గంటలు పొట్ట గురించే ఆలోచించేవారికి, శరీరం చుట్టూ తిరిగే వారికి తూకం ఎలా వస్తుంది, హృదయంలోనికి ఎలా దిగగలడు. హృదయంలోనికి దిగటానికి వాడికి బరువు సరిపోదు. మృత మనస్సుకే ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీకు మృతమనస్సు కలగాలంటే చచ్చిన వాడిలా బ్రతుకు అన్నారు భగవాన్. ఏ భావాలు లేకుండా ఉన్నప్పుడు నీ మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. సమాధి స్థితిలో తాను ఉన్నాను అన్న సంగతి తనకు తెలుస్తూ ఉంటుంది, ఏ భావాలు, తలంపులు రావు, మనస్సుతో మనం సంపాదించేది అంతా మిధ్యా జ్ఞానమే. ఇప్పుడు మనకు ఉన్నది మిధ్యా జ్ఞానము దానినే ఆత్మజ్ఞానము అనుకొంటున్నాము. మిధ్యా జ్ఞానము ఆత్మ జ్ఞానము అవ్వదు.

గొడవలు కల్పించేది, అశాంతిని తీసుకొని వచ్చేది అశుద్ధ మనస్సు. నీ మనస్సులో ఉన్న మాలిన్యములను తొలగించుకోవటానికే సాధన. లోపల ఉన్న వస్తువును కొత్తగా కనిపెట్టనక్కరలేదు. లోపలఉన్న వస్తువు అనుభవంలోనికి వచ్చిన తరువాత దేహము ఉన్నా ఆనందమే, దేహము లేకపోయినా ఆనందమే ఎందుచేతనంటే ఆ వస్తువులో ఉన్నదే ఆనందం. అశుద్ధ మనస్సే సంసారం, మనస్సు అణిగే వరకూ సంసారం అణగదు. మనస్సు ఉన్నంతకాలం సంసారం మీద రుచిపోదు. మనస్సు నశిస్తే నీవు నశించవు. నీవు ఎవడో నీకు తెలుస్తుంది. మనస్సే నీవు అనుకొంటున్నావు కాబట్టి మనస్సుపోతే నేనుపోతాను అనుకొంటున్నావు. ఏవస్తువును పట్టుకోవాలి ఏవస్తువును విడిచిపెట్టాలి అనే వివేకం లేకపోతే మనస్సుకు అంతర్ దృష్టి కలుగదు. ఆత్మకాని దానిని విడిచిపెట్టాలి, ఆత్మను పట్టుకోవాలి, ఆ వివేకం లేకపోతే కోటి జన్మలు ఎత్తినా నీకు జ్ఞానం కలుగదు. ఇందులో పెద్ద కష్టం ఏమీ లేదు. కష్టం, కష్టం అనేది కూడా ఒక తలంపే సూర్యుడిని చూడటానికి దీపం సహాయం అవసరం లేదు. నీ మొఖం అటు త్రిప్పితే చాలు అదే విధంగా నీలో జ్ఞానసూర్యుడు ఉన్నాడు. నీ మొఖం అటు త్రిప్పితే సూర్యుడిని ఎలా చూడగలుగుతున్నావో అలాగే బాహ్యంగా విజృంభిస్తున్న నీ మనస్సును ఒక్కసారి లోపలకు త్రిప్పితే ఆత్మయొక్క వెలుగులోనే ఆత్మను దర్శించవచ్చును. సాధన చేసి, సాధన చేసి గమ్యంచేరటం ఒక పద్ధతి. సాధన చేసేవాడు ఎవడు అని విచారణ చేయటం ఒక పద్ధతి. సాధన చేసేవాడు ఎవడు అని ప్రశిస్తే సాధన చేసేవాడు ఉండడు, వాడు పత్తా లేకుండా పోతాడు. వస్తువును. పొందుతావు.

**(జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము 19-4-98)**